ప్రజాశక్తి

ఆదివారం 30 అక్టోబర్ 2023

5

పార్వతీపురం మన్యం

ఇ-క్రాప్ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమిలో ఖరీఫ్ సీజన్‌లో ఇ-క్రాప్ సామాజిక తనిఖీని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇ- క్రాప్ నమోదు చేసుకున్న వారి జాబితాలో పేర్లు చూసుకోవాలన్నారు అలాగే ఈ సామాజిక జాబితాలో పేర్లు చూసుకొని ధాన్యాన్ని అమ్ముకునేందుకు వీలు కల్పించబడుతుందన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆ రైతుల పేర్లు జాబితాలను సామాజిక తనిఖీ ద్వారా చూపించబడతాయన్నారు. ఎవరివైనా జాబితాలో పేర్లు తప్పిపోతే వెంటనే సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ మార్పు శ్రీదేవి, వైసిపి నాయకులు, ఎంపిటిసి సభ్యులు సిహెచ్ జగదీష్, మాజీ ఎంపిటిసి ఆర్.వెంకటరమణతో పాటు రైతులు పాల్గొన్నారు.

హాహాకారాలు.. ఆర్తనాదాలు

నుజ్జునుజ్జయిన రైలు భోగీలు

ఆదివారం రాత్రి 7.10 గంటల సమయం.. ఇంతలో ఒక్కసారిగా పెద్దశబ్దం.. ఆ రెండు రైళ్లలో ప్రయాణిస్తున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తేరుకుని చూసేసరికి భోగీలు నుజ్జునుజ్జయ్యాయి. కళ్లెదుటే పదులాది మంది గాయపడ్డారు. కాళ్లు చేతులు విరిగిపోయిన వారి హాహాకారాలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. అప్పటివరకూ తమతో కలిసి ప్రయాణించిన పలువురు విగతజీవులుగా మారడంతో ఆ ప్రాంతమంతా భీతావహ పరిస్థితి నెలకొంది. తీవ్ర విషాదం అలముకుంది. రైల్వే శబ్దం విని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అధికారులకు సమాచారం తెలియడంతో హుటాహుటిన చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రైల్వే పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి, జామి, లక్కవరపుకోట, కొత్తవలస, విజయనగరం కోట, టౌన్

కంటకాపల్లి రైల్వేస్టేషన్ దాటాక లక్కవరపుకోట మండలం భీమాళి సమీపాన ఆదివారం రాత్రి 7.10 గంటల సమయంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య 20పైనే ఉంటుందని స్థానికులు అంటున్నారు. సుమారు వందమంది వరకు గాయపడినట్లు తెలుస్తోంది. విశాఖ నుంచి పలాస వెళ్తున్న పాసింజర్ రైలు కంటకాపల్లి స్టేషన్ దాటిన తరువాత భీమాళి సమీపాన విద్యుత్ లైన్ సరఫరా లేక ఆగింది. అదే సమయంలో దాని వెనుకనే వస్తున్న విశాఖ-రాయగడ ప్యాసింజర్‌కు కంటకాపల్లి స్టేషన్‌లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో స్పీడ్‌గా వెళ్తూ ముందున్న రైలును ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు రైళ్లకు చెందిన నాలుగు భోగీలు పట్టాలు తప్పడమే కాకుండా నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటనలో రాయగడ పాసింజర్ రైలు డ్రైవర్‌తో పాటు 8 మంది మృతి చెందారు. రాత్రి 11 గంటల వరకు వారిని బయటకు తీశారు. మృతుల సంఖ్య 20 వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

క్షతగాత్రులకు సిపిఎం నాయకుల పరామర్శ

విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రికి క్షతగాత్రులను అంబులెన్సుల్లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు జి.శ్రీనివాస్ పరామర్శించారు. ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు చేరుకొని క్షతగాత్రులకు అవసరమైన రక్తం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

కోలగట్ల పరామర్శ

జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు కోలగట్ల సూచించారు.

ఘటనా స్థలంలో తల్లి, చిన్నారి రోదనలు

ఘటనా స్థలంలో సహాయక చర్యల్లో సిబ్బంది

38 మందికి చికిత్స

విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించిన 38 మంది క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరి ంటెండెంట్ అనిలాసుందరి తెలిపారు. 50 మంది వైద్యులతో వీరికి వైద్య సేవలందిస్తున్నామని వెల్లడి ంచారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో మరో మూడు అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకొచ్చారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి బొత్స

ప్రమాదం విషయం తెలిసిన వెంటనే విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ సూర్యకళ, ఎల్.కోట ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద ఘటన గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సహాయ చర్యలను ముమ్మరం చేశారు.

ఆగిన రైళ్లు.. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

రైళ్ల ప్రమాదంతో అటు విశాఖపట్నం, ఇటు రాయగడ, భువనేశ్వర్‌వైపు వెళ్లే పలు రైళ్లు విజయనగరం రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయాయి. సాయంత్రం 7.10 గంటలకు ఈ ఘటన జరగడంతో అప్పటినుంచి వచ్చిన రైళ్లన్నీ ఇక్కడ నిలిచిపోయాయి. సికింద్రాబాద్ వెళ్లే నాగావళి ఎక్స్‌ప్రెస్, గొట్లాం రైల్వేస్టేషన్‌లో ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, చెన్నై వెళ్లే సంత్రగంజ్, కోర్బా తదితర రైళ్లు నిలిచిపోయాయి. గొట్లాం స్టేషన్‌లో సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులంతా రైలులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో విజయనగరం రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రయాణికుల పడిగాపులు

వైభవోపేతం... విజయనగర ఉత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, కోట

విజయనగరం ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ నిర్వహించిన శోభాయాత్రను ఆదివారం రాష్ట్రమంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. పైడితల్లమ్మ ఆలయం నుంచి కోట, సింహాచలం మేడ మీదుగా గురజాడ కళాక్షేత్రం వరకు ర్యాలీ సాగింది. సుమారు 71 కళారూపాలు, అంశాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రదర్శనలో పాల్గొన్నారు.

80 మంది కవులతో కవి సమ్మేళనం

లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో 80 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ జనార్ధనరావు , కవులు జక్కు రామకృష్ణ, చీకటి దివాకర్, మింది విజయ మోహనరావు, సూర్య లక్ష్మి, చంద్రిక, చివుకుల శ్రీలక్ష్మి, బాలకృష్ణ, తదితరుల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. అనంతరం 108 మంది సాహితీమూర్తుల విరచిత రచనా సమాఖ్య వారి గురు బ్రహ్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విజ్ఞానం పెంపొందించేలా

కోటలో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విజ్ఞానాన్ని పెంపొందించేలా ఉంది. ఆంధ్రా యూనివర్శిటీ ఇన్నోవేషన్ డిపార్టుమెంటు అఫ్ డ్రోన్ టెక్నాలజీ, సీతం కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంకేతిక పరికరాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులు చెత్తతో తయారు చేసిన బొమ్మలను, చిన్న చిన్న వస్తువులను ప్రదర్శించారు.

ఆకట్టుకున్న నాటికలు, ఏకపాత్రలు

స్థానిక గురజాడ కళాక్షేత్రంలో ప్రదర్శించిన ఏకపాత్రాభినయాలు, సాంఘిక నాటకాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ సామాజిక అంశాలపై స్థానిక నాటక సమాజాలు ప్రదర్శించిన అమ్మో బొమ్మ, రుణాలబంధం, ఒక రాక్షసుడి కథ, ఆఖరి ఉత్తరం, శిక్ష, పుటుక్కు జరజర డుబుక్కుమే నాటికలు ఆలోచింపజేశాయి. చాసో స్మారక భవనంలో ప్రదర్శించిన ఏకపాత్రలు అలరించాయి.

మన్యంపై అడుగడుగునా నిర్లక్ష్యం

- మన్యంపై అడుగడుగునా నిర్లక్ష్యం
- అమలుకు నోచని హామీలెన్నో ?
- నాడు టిడిపి.. నేడు వైసిపి... ఇరు ప్రభుత్వాలదీ ఇదే తీరు
- నేటి నుంచి సిపిఎం ప్రజా రక్షణ భేరి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లాపై అడుగడుగునా పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. పేరుకు ప్రత్యేక జిల్లా అయినప్పటికీ వారి సామాజిక భద్రత మొదలుకుని, ఆర్థిక స్వేచ్ఛ, సమానత్వం అన్నింటికీ దూరంగానే ఉన్నారు. చివరికి ఏనుగుల దాడులు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో గిరిజనులతోపాటు మైదాన ప్రాంత వాసులు సైతం భయం గుప్పెట్లో బతుకీడుస్తున్నారు. జిల్లాలో తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో రైతాంగం తల్లడిల్లుతోంది. విద్య, వైద్య సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రపంచం ఓ కుగ్రామంలా మారినప్పటికీ గిరిశిఖర గ్రామాల్లో ఇంకా డోలి మోతలు తప్పడం లేదు. ముఖ్యంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీలు నీటిమూట లుగానే మిగిలాయి. అంతకు ముందున్న టిడిపి ప్రభుత్వంలోనూ అభివృద్ధిలో ఏమంత దూసుకుపోలేదు. ఈనేపథ్యంలో ప్రజల కష్టనష్టాలు తెలుసుకుని, ప్రభుత్వాలను ఎండగట్టేందుకు సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 30 నుంచి నవంబర్ ఒకటో తేదీ వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజారక్షణ భేరి పేరిట బస్సు యాత్ర సాగనుంది.

మన్యం జిల్లాలో తోటపల్లి, జంఝావతి సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఆచరణలో తోటపల్లికి తగినంతగా నిధులు కేటాయించలేదు. జంఝావతి పూర్తికి ఒడిశాతో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు రాజకీయంగా చిత్తశుద్ధి కనబర్చలేదు. అంతకు ముందు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం కూడా నిధులు అంతంత మాత్రంగానే కేటాయించింది. దీంతో ఈ రెండు సాగునీటి ప్రాజెక్టులూ లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించడం లేదు. ఏజెన్సీలోని జీవగెడ్డలపై మినీ రిజర్వాయర్లు, చెక్‌డ్యాములు నిర్మించడం ద్వారా సాగునీటి వనరులను పెంచాలని స్థానికులు దశాబ్దాల తరబడి కోరుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదు. అటు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోటార్ వాహన చట్టాల వల్ల సాలూరు లారీ పరిశ్రమ కుదేలైంది. దీనికి తోడు ట్యాక్సులు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు జీవనోపాధిని దెబ్బతీశాయి. విద్యుత్ ఛార్జీల పెంపు, ప్రభుత్వ విధానాల కారణాల జీగిరాం జ్యూట్ మిల్లు అనేక ఒడిదొడు కులు ఎదుర్కొంటోంది. 1983లో 2వేల మందికి ఉపాధి కల్పించే ఈ మిల్లులో ప్రస్తుతం 1200 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇది కూడా 17 నెలలుగా మూతపడటంతో ఉపాధి లేక విలవిల్లాడుతున్నారు.

ఒడిశా ప్రాంతం లకేరి అడవుల నుంచి వచ్చిన అడవి ఏనుగుల గుంపు 16 ఏళ్లుగా మన్యం వాసుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఏనుగుల దాడిలో 17 మంది మృతిచెందారు. వేలాది ఎకరాల్లో పంటలను నాశనం చేశాయి. ఈ నేపథ్యంలో ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని జిల్లా వాసులు గగ్గోలు పెడుతున్నా అతీగతీ లేకుండా పోయింది. చాలా గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించక పోవడంతో అక్కడి గిరిజనులు ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందలేకపోతున్నారు. గిరిజన చట్టాలు సరిగా అమలు కావడం లేదనే ఆందోళనలో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. జంఝావతి సాగునీటి ప్రాజెక్టు పూర్తికి ఒడిశా రాష్ట్రంతో నెలకొన్న చిన్నపాటి వివాదం నాలుగు దశాబ్దాల తరబడి కొనసాగుతోంది. దీన్ని పరిష్కరించే పేరుతో శ్రీకాకుళంలోని ఓ పార్టీ నేత పెళ్లికి వెళ్లిన సిఎం జగన్ పనిలో పనిగా భువనేశ్వర్ వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర అధికారులతో చర్చించారు. ఇది జరిగి సుమారు మూడేళ్లు కావస్తున్నా, తరువాత పట్టించుకోలేదు.

పాచిపెంట మండలం కుడుమూరు రెవెన్యూ పరిధిలోని గిరిజనులు సాగుచేసుకుంటున్న 782 ఎకరాలకు పట్టాలిచ్చేందుకు పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మరోవైపు ఈ భూములన్నీ తమవేనంటూ కొంతమంది పెత్తందారులు కైవశం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరికి పాలకులు వత్తాసు పలకడంతో సిపిఎం ఆధ్వర్యాన ప్రతిఘటించడంతో ప్రస్తుతానికి వెనక్కి తగ్గారు. మద్దతు ధర కల్పించాలంటూ జిల్లాలోని వేలాది మంది జీడి రైతులు ఇటీవల ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వానికి పట్టడం లేదు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్యం అందించే ఎఎన్‌ఎంలు లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తుంది. నేటికీ డోలీ మోత తప్పడం లేదు. సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 176 సవరభాష పాఠశాలలు ఉన్నాయి. వారి సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణమైన భాష ద్వారానే విద్యాబోధన చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోలేదు.

పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తికాకపోవడంతో నాగావళి నదిలో నుంచి వెదురు బొంగులపై చికిత్స కోసం చిన్నారి తరలిస్తున్న గిరిజనులు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల ఏర్పాటుకు ఐటిడిఎ అధికారులు చర్యలు చేపట్టినా పనులు మాత్రం ప్రారంభించలేదు. కొమరాడ మండలం పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో, సుమారు 20 గ్రామాల ప్రజానీకం మండల కేంద్రానికి రావాలంటే సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరం మేర ప్రయాణం చేయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రాణాపాయంలో ఉన్న రోగులను సైతం నాటుపడవలో ప్రయాణించాల్సిన దుస్థితి దాపురిస్తోంది. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ వంతెను ఎప్పటికి పూర్తిచేస్తారంటూ జిల్లా పరిషత్ సమావేశాల్లో వీరంగం సృష్టించి, సభను స్తంభింపజేసిన కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కనీసం పట్టించుకోవడం లేదని కొమరాడ మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా మన్యం జిల్లాలో ఎన్నో సమస్యలు, మరెన్నో అమలు కాని హామీలు ఉన్నాయి.

నేడు కురుపాం, పార్వతీపురాల్లో బహిరంగ సభలు

సీతంపేటలో ప్రారంభం

సిపిఎం నేతలు రాఘవులు, శ్రీనివాసరావు రాక

ప్రజారక్షణ భేరి పేరిట సిపిఎం ఆధ్వర్యాన తలపెట్టిన బస్సు యాత్ర సీతంపేట ఐటిడిఎ కేంద్రం నుంచి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. 30, 31వ తేదీ వరకు మన్యం జిల్లాలోనూ, 1వ తేదీన విజయనగరం జిల్లాలో యాత్ర సాగుతుంది. యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వం వహించనున్నారు. తొలిరోజు కురుపాం, పార్వతీపురం కేంద్రాల్లో బహిరంగ సభలు జరుగుతాయి. సభలకు ముఖ్యఅతిథిగా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు హాజరు కానున్నారు. యాత్రలో సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారు. 30న సీతంపేట నుంచి పాలకొండ మీదుగా కురుపాం చేరుతుంది. మధ్యాహ్నం 1 గంటకు బహిరంగ సభ జరుగుతుంది. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు పార్వతీపురం పట్టణంలో బహిరంగ సభ జరుగుతుంది. యాత్ర బృందం రాత్రికి అక్కడే బసచేస్తుంది. 31వ తేదీ ఉదయం 9 గంటలకు సీతానగరం, 12 గంటలకు సాలూరు చేరుతుంది. సాలూరు పట్టణంలో బహిరంగ సభ అనంతరం సాయంత్రం 6 గంటలకు విజయనగరం జిల్లా మెంటాడకు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తుంది.

ప్రజాధనం దోచేస్తే జైల్లో పెట్టరా? : మంత్రి బొత్స

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాధనం దోపిడీ చేయడం వల్లనే జైల్లో పెట్టారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. వైసిపి ప్రజాసాధిక బస్సు యాత్ర విజయవంతం చేయడానికి ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులో డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి బొత్స మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం గురించి వివరించడానికి బస్సు యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. నవంబర్ 8న పట్టణంలో సామాజిక సాధికారత సభ, 9న రాష్ట్రానికి జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు కావాలో సచివాలయాల పరిధిలో సభలు నిర్వహించాలని కోరారు. ఈ సభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జగన్ నాయకత్వంలో మాత్రమే బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందని తెలిపారు. గిరిజన ఎమ్మెల్యేలకు డిప్యూటీ సిఎం పదవులిచ్చిన సిఎం జగన్ అని చెప్పారు. టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. జన్మభూమి కమిటీలతో టిడిపి దోపిడీ పాలన సాగించిందని చెప్పారు. గడచిన నాలుగేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో రూ.1200 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జరిగాయని చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు జైల్లో ఉండి 50రోజులైతే టిడిపి నాయకులు, కార్యకర్తలు రోడ్లపై నిరసన కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరి పైన ఒత్తిడి పెంచుతారనీని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నాయకత్వంలో వైసిపిని మళ్లీ గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ నకిలీ గిరిజన నాయకుల పాలనలో ఈ నియోజకవర్గం చాలా కాలం సాగిందని చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నాయకత్వంలో నిజమైన గిరిజన నాయకుడికి పట్టం కట్టారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గతం కంటే భారీ మెజారిటీతో వైసిపి విజయం సాధిస్తుందన్నారు. మన్యం జిల్లా అధ్యక్షులు ఎస్.పరీక్షిత్ రాజు మాట్లాడుతూ సిఎం నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజారంజకంగా పాలన సాగిస్తోందని అన్నారు. వైసిపికే ప్రజలు మళ్ళీ పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ టిడిపి హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప జరిగిందేమీ లేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై తాను ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమేనన్నారు. ఇప్పటికే వందసార్లు చర్చకు రావాలని టిడిపి నాయకులకు సవాల్ విసిరానని, కానీ చర్చకు రాలేదని చెప్పారు. వచ్చేనెల 8న జరగనున్న బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు. గతంలో జగన్ పాదయాత్ర సందర్భంగా జరిగిన సభ కంటే ఎక్కువ సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు వి.శ్రీనివాసరెడ్డి, మక్కువ మండల సీనియర్ నాయకులు శ్రీనివాసరావు నాయుడు, రంగు నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సభాస్థలం పరిశీలించిన జెడ్పీ చైర్మన్, మంత్రి

వచ్చేనెల 8న జరగనున్న వైసిపి సామాజిక సాధికారత బస్సు యాత్రలో భాగంగా నిర్వహించనున్న బహిరంగ సభకు స్థలాన్ని ఆదివారం సాయంత్రం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ సిఎం రాజన్నదొర పరిశీలించారు. బోసుబొమ్మ జంక్షన్‌లో సభ ఏర్పాటుపై పట్టణ, మండల నాయకులతో చర్చించారు. ఆరోజు సభ నిర్వహణ సమయంలో ట్రాఫిక్ నియంత్రణ గురించి టౌన్ సిఐ శ్రీనివాసరావుతో మాట్లాడారు. పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు వారి వెంట ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

విఒఎల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - బెలగాం

విఒఎల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని సిఐటియు రాష్ట్రకార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో విఒఎ సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ విఒఎలతో రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మెర్జ్ ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, లోకో యాప్ వర్క్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాలంటరీ ఐడితో విఒఎతో పని చేయించరాదన్నారు. 15 సంఘాల్లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించాలని, విఒఎల కుదింపు వల్ల ఉపాధి కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మహిళ మార్టుల్లో సరుకులు, విత్తనాలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గేదెలు వంటివి పొదుపు సంఘాల మహిళలతో బలవంతంగా పంపించే పద్ధతిని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విఒఎ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారావు, వి.సుందరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ పలువురు విఒఎలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో కరిరాజు సంచారం

పేదలకు బట్టలు, ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మహిళలకు బట్టలు, ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదంకలాంలో మహిళలకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన సొంత ఖర్చులతో సమకూర్చిన చీరలను ఆదివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేద మహిళలకు ప్రతి ఏటా బట్టలను పెట్టడంతో పాటు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బలగ రవణమ్మ, నాయకులు శ్రీరాములు నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ వెంపలి గురురాజు, స్థానిక సర్పంచులు బలగ శ్రీనివాసరావు, గునుపూరు అన్నంనాయుడు, నాయకులు రెడ్డి అప్పల నాయుడు, ఎలక్ట్రికల్ యూనియన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ బలగ సాయికృష్ణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



వజ్రభారతికి హారతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపిపి, రచయితలు

ప్రతిభ కలిగిన కవులు ఉండడం అదృష్టం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో ప్రతిభ కలిగిన కవులు ఉండడం మన అదృష్టమని వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండల ఉపాధ్యాయులు, ఏజెన్సీ కవులు పాలక దేవానంద్, పెద్దింటి నిర్మల్‌కుమార్ పాటలను ప్రచురించిన వజ్ర భారతకి హారతి పుస్తకాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితో పాటు మరోవైపు ఖాళీ సమయాల్లో విద్యార్థుల్లో స్ఫూర్తి నింపే పాటలు, కవితలు రచించడం అభినందనీయమన్నారు. నిర్మల్ మాస్టార్ రచించిన 'ఇదే ఇదే మన దేశం భారతదేశం', దేవానంద్ మాస్టర్ రచించిన 'భారతదేశం నాది సుందరపు ప్రదేశం మనది' పాటలకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని గేయాలను రచించి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు.

నేడు వాహనాల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 13 ద్విచక్ర వాహనాలను ఈనెల 30న వేలం వేస్తున్నట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. వేలంం పాటలో పాల్గొనే వారు అధికారులు నిర్ణయించిన ధరావత్తు రూ.2000 ముందుగా చెల్లించి టోకెన్ తీసుకొని వేలం పాటకు హాజరు కావాల్సిందిగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

డీలర్‌పై విచారణ చేస్తున్న అధికారులు

డీలర్ అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి - భామిని

మండలంలోని మాణిగ పంచాయతీలోని గల రేషన్ షాపు డీలర్ అవకతవకలపై తహశీల్దార్ అప్పారావు, సిఎస్‌డిటి మధు, విఆర్ఓ బి.గోపాల్ ఆదివారం విచారణ నిర్వహించారు. డీలర్ గత కొంతకాలంగా సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా, లబ్ధిదారుల నుండి ముద్రలు వేసి బియ్యం పంపిణీ చేయకపోవడం, పంచదార, కంది పప్పు లబ్ధిదారులకు అధిక ధరకు ఇవ్వడం, కొందరికి పూర్తిస్థాయిలో ఇవ్వకపోవటం వంటి అంశాలపై రేషన్ షాపుల పరిధిలోని లబ్ధిదారులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి అంశాలను రికార్డు చేశారు. ఈ సందర్భంగా ఆ షాపు రేషన్ డీలర్‌ను పూర్తి స్థాయిలో తొలగించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో మాణిగ సర్పంచ్ కొండగొర్రి మంగ, గజపతి, సుబ్బారావు, సుమన్, చంటి వున్నారు.

పారాయణాలు నిర్వహిస్తున్న నరహరశాస్త్రి

సూర్యపీఠంలో మన్యు సూక్త, సర్పసూక్త పారాయణాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్య పీఠంలో ఆదివారం బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో భానువార ప్రయుక్త సౌర దీక్షలో సూర్య నమస్కారాలు, సౌర, సుదర్శన హెూమాలు, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, మిత్ర రవి, సూర్య, భాను, ఖగ పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య సవిత అర్క భాస్కర దేవతలకు పూజలు జరిగాయి. అనంతరం మన్యు సూక్త, సర్ప సూక్త మంత్ర పారాయణాలు, హోమాలు జరిగాయి. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్ , డి.ఉమాశర్మ, టిఆర్ కృష్ణ శర్మ వైదిక సహకారం అందించారు.

పార్కులో సందడే సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సండే సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నిండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా తరలివచ్చారు. పార్క్‌లోని అందాలను ఆస్వాదించారు. కుటుంబీకులతో కాసేపు పార్క్ చుట్టుముట్టారు. యువత హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. చిన్నారులు మినీ ట్రైన్ వద్ద ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. అనంతరం జగత్‌పల్లి రిసార్ట్స్ సందర్శించారు. ఆడలి వ్యూ పాయింట్ సందర్శించి అందాలను కనువిందు చేశారు. మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడారు.

సందడి చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో పలుమండలాల్లో సంచరిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న గజరాజులు ఇప్పుడు జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలోనే ప్రవేశించి పురప్రజలను గజగజ వణికిస్తున్నాయి. గుంపునుండి విడిపోయిన హరి అనే ఒంటరి ఏనుగు ఆదివారం వేకువజామున పట్టణశివారు కొత్తవలస బదో వార్డులోని మణికంఠ కాలనీలో సంచరిస్తూ భయోత్పాతం సృష్టించింది. కొమరాడ మండలం నుంచి పనులు జరుగుతున్న రైల్వే ట్రాక్ మీదుగా నడుచుకుంటూ టౌన్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ నుండి మణికంఠకాలనీ, రైల్వే ఫ్లైవర్ బ్రిడ్జి పక్క నుంచి విజయరామరాజు కాలనీవైపు వెళ్లినట్లు ప్రత్యక్షంగా చూసిన వారు చెబుతున్నారు. ఏనుగు ప్రవేశించిన వేళ అర్ధరాత్రి కావడంతో జనసమ్మర్థం లేకపోవడంతో పెద్దగా నష్టం జరగలేదు. అయితే దృశ్యాలను సెల్ ఫోన్లలో బంధించిన కొందమంది యువకులు సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేయడంతో ఏకంగా పట్టణంలోకి ప్రవేశించిన ఏనుగును చూసి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సాధారణంగా పట్టణంలో వేకువజామున ముందే జనం సందడి మొదలౌతుంది. వ్యవసాయ పనులు, చిల్లరవ్యాపారస్తులు, ప్రయాణికులు, మార్నింగ్ వాకింగ్, దైవదర్శనాల నిమిత్తం బయటకు వచ్చేవారు ఈ ఏనుగుబారిన పడే అవకాశం ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పట్టణంలోని కొత్తవలసలో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

ఏనుగుల నియంత్రణలో అటవీశాఖ తీవ్ర వైఫల్యం

ఒడిషాలోని లకేరి అడవుల నుంచి ఆరేళ్లక్రితం వచ్చిన ఏనుగుల గుంపును నియంత్రించడంలోను, వాటిని వేరే ప్రాంతాలకు తరలించడంలో అటవీశాఖ అధికారులు, ప్రభుత్వం తీవ్రమైన వైఫల్యమైందని జిల్లా వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో దీర్ఘకాలంగా తిష్టవేసి ఉన్న మాజీ గిరిజన సంక్షేమశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన ఎమ్మెల్యే ఏనుగుల తరలింపుపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై ప్రజాసంఘాల నాయకులు జిల్లా అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగితే బాధితులకు నష్టపరిహారానికి కృషి చేస్తున్నామని, ఏనుగులను తరలించేందుకు మళ్ళీ ఏనుగులను (కొంకి) తెప్పించేందుకు పైఅధికారులకు సిఫార్సులు చేశామని చెబుతున్నారు. పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలకు పెద్ద సమస్యగా మారిన ఏనుగుల తరలింపుపై ప్రభుత్వం గానీ, అధికారులు గానీ చర్యలు తీసుకోకపోతే ప్రజలే పెద్దఎత్తున ఉద్యమించే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

రాత్రి వేళల్లో గస్తీ పెంపు : డిఎఫ్ఓ

ఏనుగు సంచారంపై రాత్రి వేళల్లో గస్తీ (పెట్రోలింగ్) పెంపు చేశామని జిల్లా అటవీ అధికారి జిఎపి ప్రసూన తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం అర్ధ రాత్రి ఒంటరి ఏనుగు "హరి" పార్వతీపురం పట్టణం మీదుగా కొత్త దారిలో అంకులవలస చేరుకుందన్నారు. ఏనుగుల సంచారంపై సమాచారం ఉంటే పార్వతీపురం ఫారెస్ట్ సెక్షన్ అధికారి 9493399467, ఏనుగుల పర్యవేక్షణ విభాగం అటవీ రేంజ్ అధికారి 9440821237 ఫోన్ నంబర్లకు ప్రజల భద్రతకు, సురక్షితకు చర్యలు తీసుకొనుటకు సహకరించాలని ఆమె కోరారు.

పైడితల్లమ్మ ఆలయం

నేడు తొలేళ్ల ఉత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మ పండగలో ప్రధాన ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం సోమవారం అర్ధరాత్రి జరగనుంది. ఉదయం నుంచి ప్రజలు ఘటాలతో అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త అయిన పూసపాటి వంశీయులు పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించనున్నారు. తొలేళ్ల ఉత్సవం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు రానున్నారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి అమ్మవారి చదురుగుడి నుంచి వేద పండితులు మంత్రోత్సవాల మధ్య ఘటాలు మూడు లాంతర్ల మీదుగా కోట వరకు వాయిద్యాలు, పులివేషాలు నడుమ చేరుకుంటాయి. అక్కడ అమ్మవారి పూజారి పండగ విశేషాలను భక్తులకు వివరించనున్నారు. అనంతరం వరి విత్తనాలను చల్లనున్నారు. రైతులు ఆ విత్తనాలు తీసుకునేందుకు పోటీ పడతారు. ఆ విత్తనాలు పొలంలో వాడితే మంచి పంటలు పండుతాయని రైతుల నమ్మకం.

డ్రైవర్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

విజయవాడ ఆర్‌టిసి డిపోకు చెందిన బస్ డ్రైవర్ భక్తుల రాంసింగ్‌పై ఒంగోలులో కారును పక్కకు తీయమన్నందుకు విచక్షణారహితంగా కొట్టిన 19 మందిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని సిఐటియు ఆధ్వర్యాన ఆటో వర్కర్స్ యూనియన్, ఆర్‌టిసి నాయకులు మండలంలోని మామిడిపల్లి మూడు రోడ్ల కూడలిలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా రంగంలో నిత్యం ప్రజలకు సేవ చేస్తున్న బస్, ఆటో, లారీ వివిధ రకాలుగా సేవలందిస్తున్న కార్మికులపై ఎప్పటికప్పుడు కొందరితో ఇబ్బందులు పడుతూ పనిచేస్తున్నారని అటువంటి వారిపై కొందరూ కావాలనే కక్షపూరితంగా కొట్టడం, తిట్టడం చేస్తున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని అన్నారు. బస్సుకు అడ్డంగా కారు తీయమన్నందుకే ఒక్కడ్ని చేసి అంత మంది విచక్షణారహితంగా కొట్టడం దారుణమన్నారు. దోషులు ఎంతటి వారైనా వెంటనే వారిని శిక్షించాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ముంగారమ్మ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జర్జాపు జ్యోతిష్య రావు, కృష్ణ, అప్పలరాజు, మహేష్, శ్రీను, ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్ లపై విచక్షణా రహితంగా దాడికి నిరసనగా ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద జెఎసి ఆధ్వర్యాన సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. హారన్ కొట్టిన వెంటనే దారి ఇవ్వలేదనే ఆగ్రహంతో అమానుషంగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేయడం దారుణమని జెఎసి నాయకులు ఎంఎస్ నారాయణ చెప్పారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు పి.సుందరరావు, ఎటి నాయుడు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై వ్యక్తులు దాడికి నిరసనగా జిల్లా కేంద్రంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉన్న ఇయు, ఎన్ఎంయు, వైఎస్ఆర్‌సిపి సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా సంఘాల సభ్యులు నరసింగరావు, డిఎ నాయుడు తదితరులు మాట్లాడుతూ, రహదారిపై అడ్డుగా ఉన్న కారును తీయాలని హరన్ కొట్టి కోరగానే విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ రాంసింగ్‌పై 19 మంది వ్యక్తులు దాడి చేయడం అమానుషమని వెంటనే వారందరిని అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై చర్యలు చేపట్టాలని, లేనిచో జెఎసి ఆధ్వర్యంలో ఉమ్మడి పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు.

సాలూరు : మామిడిపల్లిలో నిరసన తెలుపుతున్న ఆటో యూనియన్, ఆర్‌టిసి నాయకులు

పాలకొండ : ఆర్టీసీ డ్రైవర్ రామ్ సింగ్ పై దాడి చేసినవల్ని కటినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలతో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రీజియన్ కార్యదర్శి బాసురు కృష్ణమూర్తి మాట్లాడుతూ బెంగళూర్ నుంచి విజయవాడ వస్తున్న మార్గమధ్యలో కావలి వద్ద 19 మంది దుండగులు డ్రైవర్‌పై దాడి చేశారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వారాడ వెంకటరమణ, బివి రమణ, ఎంఆర్ మూర్తి అన్నారు.

పాచిపెంట : ప్రజారక్షణ భేరి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గిరిజనులు

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సాలూరు

సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 31న పట్టణానికి చేరనున్న ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు, సీదరపు అప్పారావు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు ప్రజారక్షణ భేరి యాత్రకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి 31న జరుగబోయే సభలో ప్రసంగిస్తారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని చెప్పారు. పట్టణంలోని బోసుబొమ్మ జంక్షన్‌లో జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.వెంకటరావు వున్నారు.

సీతానగరం: సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ యాత్ర జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఈ యాత్ర ఈనెల 31న సీతానగరం వస్తుందని, ఈ సందర్భంగా దీన్ని జయప్రదం చేయాలని కోరారు

పాచిపెంట : ఈనెల 31న సాలూరులో జరుగుతున్న సిపిఎం ప్రజారక్షణభేరి బస్సు యాత్ర సభలో సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట మండల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, ఎస్.అప్పలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎన్వై నాయుడు తెలిపారు. బస్సు యాత్ర సభ జయప్రదానికి ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈతమానవలస, పాచిపెంట, కుడుమూరు తదితర పంచాయతీల్లో ప్రచారం నిర్వహించి, పోస్టర్‌ను విడుదల చేశారు.

టిడిపి ఆధ్వర్యాన 'నిజం గెలవాలి... కళ్లు తెరిపిద్దాం'

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబుపై అక్రమ కేసులు, అరెస్ట్‌కు నిరసనగా నిజం గెలవాలి కళ్ళు తెరిపిద్దాం నిరసన కార్యక్రమం మండలంలోని కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. అలాగే మండలంలోని నర్సిపురం, తాళ్లబురిడి, జమదాల గ్రామాలతో పాటు పట్టణంలోని పాత బస్టాండ్‌లో టిడిపి నాయకులు కళ్లకు గంతలు కొట్టుకొని తమ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస్, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కూనపురెడ్డి ప్రసాద్, ఐటిడిపి ఛాంపియన్ తాడ్డి ప్రవీణ్, జోజి, బార్నాల సీతారాం గొట్టాపు వెంకటరమణ గొట్టాపు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: కళ్లకు గంతలతో టిడిపి నాయకులు, కార్యకర్తలునిరసన వ్యక్తం చేశారు.నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఆధ్వర్యాన చంద్రబాబు నాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కుట్రపూరితంగా వైసిపి ప్రభుత్వం జైల్లో పెట్టిందని సంధ్యారాణి ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : కళ్లకు గంతలు కప్పి నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గరుగుబిల్లి : మండలంలోని నాగూరులో జగనాసర పాలనకు నిరసనగా కళ్లు తెరిపిద్దాం కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో నిజం గెలవాలి అని నినాదాలతో కళ్ళు తెరిపిద్దాం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి అక్కేన. జగదీశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అధికారంలోకి రావడం ఖాయం : కళా

ప్రజాశక్తి - పాలకొండ

రానున్న ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని నక్కలపేట కల్యాణమండపంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబుకు ప్రజల మద్దతు ఉండడం వల్లే అక్రమ కేసులు పెట్టారన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబుకు బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. త్వరలో చంద్రబాబు బయటకు వచ్చి ప్రజలతో ఉంటారన్నారు. పరిపాలనపై పట్టు లేకపోవడం వల్లే ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాన్నారు. టమోటా, ఉల్లి వంటి నిత్యావసరం వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తోటపల్లి కాలువ నిర్వహణకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, దీని వల్ల సాగు నీరందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి నిమ్మక జయకృష్ణ, ఎఎంసి మాజీ అధ్యక్షులు పొదిలాపు కృష్ణమూర్తి, గండి రామినాయుడు, గంట సంతోష్, సుంకర అనిల్, చెబోదుల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వంగర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల నిరసిస్తూ నవంబర్ 27,28 తేదీల్లో జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో రూపవతి అధ్యక్షతన ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయని దీని వల్ల కార్మికులు కర్షక వర్గం తీవ్రంగా నష్టపోతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో కోటి మంది కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నా వాళ్లకు ఎటువంటి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ గ్రాట్యుటి పెన్షన్ వంటి సౌకర్యాలు కూడా కల్పించకుండా గౌరవ వేతనం పేరుతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారన్నారు. తక్షణమే కార్మిక కర్షక వ్యతిరేక విధానాల్ని ఆపాలని కార్మిక వర్గానికి ఉపయోగపడే విధానాల్ని అమలు చేయాలని కోరుతూ నవంబర్ 27 28 తేదీల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానిలో కూడా రెండు రోజులు పాటు మహా పడవ్ కార్యక్రమాలు నిర్వహించి కార్మిక కర్షక వ్యతిరేకతను తెలియజేస్తామన్నారు. ఈ సదస్సులో రూపవతి, తులసి, జయలక్ష్మి, కృష్ణమూర్తి, జయమ్మ, సత్యవతి, లక్ష్మీ, సరళ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికలు తొలగిస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

శరవేగంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పాచిపెంట

పంచాయతీ విధివిధానాల ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి పారిశుధ్య పనులు చేపట్టాల్సి ఉంది. నిబంధనల మేరకు మండలంలోని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఆదివారం గరేళ్లవలస, కోడికాళ్లవలస గ్రామాల్లో కాలువల్లో పూడికలు, పారిశుధ్య కార్మికులతో తొలగించారు. తొలగించిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ ద్వారా గ్రామ శివారులో డంప్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలనాయుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులను కోరారు.

ఘాటెక్కుతున్న ఉల్లి

ప్రజాశక్తి - కురుపాం

ఉల్లిపాయ ధరలు ఘాటెక్కుతున్నాయి. కొద్ది రోజుల వరకు కిలో రూ. 20 ఉన్న ఉల్లి ధర నేడు రూ.60కు చేరుకుంది. దీంతో ఉల్లిపాయలు కొయ్యకుండానే వినియోగదారుల కళ్లలో నుంచి నీళ్లు వస్తున్నాయి. గతంలో టమోటా కిలో రూ.250 వరకు వెళ్లింది. ఇటీవలే దాని ధరలు తగ్గి సామాన్యునికి అందుబాటులోకి వచ్చాయనుకుంటున్న సమయంలో ఉల్లి ధరలు పెరిగాయి. ఉల్లి ఉత్పత్తి అధికంగా జరిగే కర్ణాటకలోని బళ్లారి తదితర ప్రాంతాల్లో వర్షాలు అధికంగా పడడంతో ఉల్లి ఉత్పత్తి తగ్గిపోవడంతో ఉల్లి ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో హెూల్ సేల్ మార్కెట్ సైతం ఉల్లిపాయలు తక్కువగా వస్తున్నట్లు తెలిపారు. హెూల్‌సేల్లో కిలో రూ.45 నుండి రూ.50 వరకు ధర పలుకుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. రవాణా తదితర ఛార్జీలను కలుపుకొని కిలో రూ.60 వరకు విక్రయిస్తున్నట్లు కురుపాంకు చెందిన ఓ వ్యాపారి తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో ఉల్లిపాయలు అధికంగా ఉత్పత్తి కావడంతో కిలో పది రూపాయలు కూడా అమ్మినట్లు చెప్పారు. ఈ ఏడాది ఉల్లి ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు.

సారిపల్లి యువకుడికి స్కూల్ ఆఫ్ సైన్స్‌లో పిహెచ్‌డి

నెల్లిమర్ల : మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన సారిపల్లి తిరుమల సంతోష్ కుమార్ డాక్టరేట్ (పిహెచ్‌డి) సాధించారు. సంతోష్ కుమార్‌కు విశాఖపట్నం గీతం యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, స్కూల్ ఆఫ్ సైన్స్‌లో పిహెచ్‌డి అవార్డు ప్రదానం చేస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. సింథసిస్ ఆఫ్ కెమిస్ట్రీలో థీసిస్ చేసినందుకు సంతోష్ కుమార్ ఈ పిహెచ్‌డి డిగ్రీ సాధించారు. సంతోష్ తండ్రి సారిపల్లి నాగరాజు పోలీసు డిపార్ట్మెంట్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్నారు. తల్లి అమ్మాజీ గృహిణి. డాక్టరేట్ సాధించిన సంతోష్ కుమార్‌ను గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

ఎటిఎం పంటలతోనే నిరంతర ఆదాయం

ప్రజాశక్తి - కురుపాం

నిరంతర ఆదాయం పొందాలంటే ప్రతి రైతు ఎటిఎం పంటలను వేసేలా చూడాలని నార్త్ కోస్టల్ తిమోటిక్ లీడ్ కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో మెంటార్స్ ఫార్మర్ సైంటిస్ట్స్ ఎటిఎం మోడల్ పంటలపై ఆదివారం జరిగే శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర ఆదాయం ప్రతి రైతు పొందాలంటే ఎటిఎం మోడల్ పంటలు వేయాలని, 20 సెంట్లు భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ సుమారుగా 20 రకాలు పంటలైన ఆకుకూరలు, కూరగాయలు, దుంప, తీగ జాతులు, పండ్ల రకాలు వేసుకోవడం వల్ల ఒక కుటుంబానికి కావాల్సిన పౌష్టిక ఆహారం లభిస్తుందని తెలిపారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, ప్రతినెలకు రూ.10 వేలు వరకు ఆదాయం సంపాదించుకోవచ్చునని, నిరంతర ఆదాయం, నిరంతర పంటలు ఉంటాయని, భూమిలోని పోషక విలువలు పెరుగుతాయని తెలిపారు. పురుగులు, తెగుళ్ల తట్టుకొనే శక్తి కలిగి ఉంటూ వానపాములు వృద్ధి చెందుతాయని, పంట మార్పిడి విధానం తప్పనిసరిగా పాటించాలని, రైతులకు కార్యకర్తలు అందుబాటులో ఉండి సమయానుకూలం తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని తెలిపారు. 4 అడుగుల వెడల్పు గల బెడ్స్ వేసుకోవాలని, బెడ్ బెడ్‌కు మధ్య అడుగు వెడల్పు గల కాలువ తీసుకోవాలని, బెడ్లపై పలు పంటలు వేసుకోవడం వల్ల ఒక కుటుంబానికి కావాల్సిన పౌష్టికాహారం సంవత్సరం మొత్తం లభిస్తుందన్నారు. 6 జిల్లాల పరిధిలోని రైతులు ఈ నమూనా వేయటానికి ప్రణాళికలు సిద్ధం చేయటం జరిగినదన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మేనేజర్ పి.షణ్ముఖరాజు, సలహాదారులు అనంతరామ్, దివ్య, మానస, మెంటర్స్, ఫార్మర్ సైంటిస్టులు పాల్గొన్నారు.

ఎటిఎం పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న నార్త్ కోస్టల్ లీడ్